క్లుప్తంగా

ఆలయ చైర్మన్ పదవి మాకివ్వండి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం ఆలయ చైర్మన్ పదవి మాకివ్వాలని ఐరాల మండలం చినకాంపల్లికి చెందిన ఉభయదారులు రవిచంద్రారెడ్డి ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు వినతి పత్రం అందజేశారు. మంగళవారం చిత్తూరులోని పూతలపట్టు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబును చినకాంపల్లికి చెందిన ఉభయదారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ చైర్మన్ పదవి కాలం ముగియనుండడంతో ఆ పదవి మాకివ్వాలని విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే పరిశీలిస్తామని వారికి చెప్పారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న శ్యామలాదేవి

గుడిపాల: నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం స్పందన ఫౌండేషన్ చైర్మన్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో క్రీడాసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ రామ్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే ఉద్దేశంతో స్పందన ఫౌండేషన్ చైర్మన్ శ్యామలాదేవి విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేయడం గర్వంగా ఉందన్నారు. రూ.35వేల విలువచేసే క్రీడా సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌కు వారు అందజేశారు.

ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై అవగాహన



శిక్షణలో మాట్లాడుతున్న ఏపీఎం

గుడిపాల: ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై అవగాహన కలిగి ఉండాలని ఇందిరా క్రాంతి ఏపీఎం సుధారాణి అన్నారు. మంగళవారం ఇందిరాక్రాంతి భవనంలో సంఘమిత్రలు, మండల సమాఖ్య లీడర్లతో ఆమె ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ పాలసీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెలుగు సీసీలు హేమచంద్రారెడ్డి, లోకనాథరెడ్డి, మల్లీశ్వరి, అకౌంటెంట్ ధనభాగ్యం పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ నిర్వహించారు. 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడాన్ని రద్దు చేయాలని ఫెడరేషన్ నాయకుడు ప్రభుతేజ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న విద్యా పథకాల మొత్తాలను చెల్లించాలన్నారు. వైద్యవిద్య కళాశాలల్లో బడుగు, బలహీనవర్గాలు, మైనారిటీ వర్గాలకు 50 శాతం కన్వీనర్ కోటా ఇవ్వాలన్నారు. నేతలు ముత్తు ప్రసాద్, గోకుల్ పాల్గొన్నారు.

మొక్కలు విరివిగా నాటాలి



విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

చిత్తూరు రూరల్: విద్యార్థులు మొక్కలు విరివిగా నాటి వాటిని సంరక్షించాలని వాసవి క్లబ్ వనిత సభ్యులు పేర్కొన్నారు. చిత్తూరులోని వరదప్పనాయుడు ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 100 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. సభ్యులు వాణి, వనిత, రాధిక, లీలా, కుసుమ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలను పెంపొందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నాగేశ్వర్‌రావు

బంగారుపాళెం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ-1 నాగేశ్వర్‌రావు, ఎంఈఓ-2 రమేష్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం బంగారుపాళెం సీఆర్‌సీ సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆధునిక విద్యావిధానాలను అనుసరించి ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థులకు బోధన చేయాలన్నారు. అందుకు తగిన విధంగా ఉపాధ్యాయులు నూతన బోధన పద్ధతులపై పట్టు సాధించాలని సూచించారు. పిల్లల్లో విద్యా నైపుణాలను పెంపొందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సీఆర్‌సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ అభిమతం



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



సర్టిఫికెట్లు అందజేస్తున్న మేయర్ అముద, కమిషనర్ అరుణ

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

పూతలపట్టు: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ అభిమతమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మంగళవారం వేపనపల్లి, పాటూరు పంచాయతీలలో అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసమస్యలను తెలుసుకోవడానికి ఏడాది పాటు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించామన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాగా పనిచేశారన్నారు. ఇప్పటికే 99 శాతం లబ్ధిచేకూరిందన్నారు. మిగిలిన ఒక్క శాతం లబ్ధిదారులకు పథకాలు వర్తింపజేసేందుకు సీఎం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తునారన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు తెలుసని వచ్చే ఎన్నికలలో ప్రజలు మళ్లీ జగనన్నకే పట్టం కడతారని తెలిపారు. అనంతరం పాటూరులో 1207, వేపనపల్లిల్లో 604 సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో పెనుగొండ నియోజకవర్గ పరిశీలకుడు బాబురెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి. రాజారత్నంరెడ్డి, జెడ్పీటీసీ దేవిక, సర్పంచులు వసంతమ్మ, మణి, సుధారాణి, లలిత, రాణెమ్మ, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్ఐ సురేష్, డీటీ మహేశ్వరి, అమర్నాథ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, బాబురెడ్డి, బాలాజి, ప్రవీణ్, మాసీలామణి, పాల్గొన్నారు.

ప్రజల చెంతకే సంక్షేమ ఫలాలు

చిత్తూరు అర్బన్: జగనన్న పాలనలో రాష్ట్రంలో సంక్షేమ పథకాల ఫలాలు ప్రజల చెంతకే వచ్చి చేరుతున్నాయని నగర మేయర్ ఎస్ అముద అన్నారు. మంగళవారం నగరంలోని 39వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నగర కమిషనర్ జె అరుణ, మేయర్ పాల్గొని లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మేయర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్రంలో లక్షల మంది లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను పొందారన్నారు. కమిషనర్ డా. జె అరుణ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వార్డుల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 39వ వార్డు పరిధిలో 534 మందికి ప్రభుత్వ సేవలు ఉచితంగా అందించామన్నారు. డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. మంగళవారం 31, 47వ వార్డుల్లోనూ జగనన్న సురక్ష కార్యక్రమాలు జరిగాయి. స్థానిక కార్పొరేటర్లు, అధికారులు హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు.

జగనన్న సురక్షకు అపూర్వ స్పందన

చిత్తూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోంది. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 334 లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజని, ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి, తొప్పాతి సర్పంచ్ మునిర్నతం, నేతలు కుమార్, నంద పాల్గొన్నారు.

ప్రజల వద్దకే 11 రకాల సేవలు

గుడిపాల: మండలంలోని 189కొత్తపల్లె, పేయనపల్లె పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 620 మందికి అవసరమైన వివిధ రకాల సర్టిఫికెట్లను వారు అందజేశారు. మండల స్పెషలాఫీసర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలోని వెలుతురుచేను గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దార్ బెన్నురాజ్, సర్పంచ్ సుబ్రమణ్యం పాల్గొన్నారు. అదేవిధంగా ఎగువరాగిమానుపెంట గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమశేఖర్, సర్పంచ్ శ్రీహరి, మాజీ మండల ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



గుడిపాలలో..



ఎగువరాగిమానుపెంటలో..



వెలుతురుచేనులో..

అర్ధగిరి క్షేత్రంలో అసిస్టెంట్ కలెక్టర్



తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

తవణంపల్లె: అర్ధగిరి వీరాంజనేయ స్వామిని మంగళవారం అసిస్టెంట్ కలెక్టర్ మేఘస్వరూప్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. అనంతరం మేఘస్వరూప్ స్వామికి అభిషేకం, అర్చనలు, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఎంఈఓ రుషేంద్రబాబు

ఐరాల: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్యాప్రమాణాలు, మెలకువలను అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో మేలు చేస్తుందని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న 43 మంది ఉపాధ్యాయులకు, కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో ఐరాల, తవణంపల్లె మండల ఉన్నత పాఠశాలల జీవశాస్త్ర సబ్జెక్టు బోధిస్తున్న 20 మంది ఉపాధ్యాయులకు అకడమిక్ యాక్టివిటీస్ పేరిట శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎంఈఓలు మాట్లాడుతూ శిక్షణతో ఉపాధ్యాయుల ప్రతిభ మెరుగుపడుతుందన్నారు. క్లస్టర్ రీసోర్స్ హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు, రీసోర్స్ పర్సన్స్ సురేంద్రబాబు, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు



నర్సింగ్ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న జడ్జి కరుణకుమార్,



హాజరైన విద్యార్థులు

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ కరుణకుమార్

తవణంపల్లె: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అరగొండ అపోలో నర్సింగ్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్‌పై నర్సింగ్ కళాశాల విద్యార్థులకు జ్యోతి ప్రజ్వలన చేసి అవగాహన కార్యక్రమం ప్రారంభించారు. కరుణకుమార్ ప్రసంగిస్తూ అంబేడ్కర్ రచించిన చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా ఒక వ్యక్తిని అవమానించినా, వేధించినా, ఎగతాళి చేసినా ర్యాగింగ్ చేసినట్లేనని పేర్కొన్నారు. ఇలాంటివి జరగకుండా జాగ్రత్తగా మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారిని కోర్టు శిక్షిస్తుందని వివరించారు. అదేవిధంగా ఇండియన్ పీనల్ కోడ్ గురించి వివరించారు. జడ్జి కరుణకుమార్ అధ్యాపకుని పాత్ర పోషిస్తూ న్యాయపరమైన అంశాలపై విద్యార్థులకు ప్రశ్నల వర్షం కురిపిస్తూ వారి నుంచి సమాధానాలు రాబట్టి వారికి సమగ్రంగా అవగాహన కల్పించారు. తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, కాణిపాకం ఎస్ఐ శ్రీనివాసరావు, తవణంపల్లె ఏఎస్ఐ రాజేంద్ర, వీఆర్ఓ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి మహేష్, ప్రిన్సిపల్ డాక్టర్ లోకేశ్వరి, వైస్ ప్రిన్సిపల్ మాలతి, చిత్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, లీలారాణి పాల్గొన్నారు.

హైస్కూల్, పీహెచ్‌సీ తనిఖీ..

అరగొండ బాలుర ఉన్నత పాఠశాలను సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ తనిఖీ చేశారు. బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో చిరుజల్లులు కురుస్తున్నా ఉపాధ్యాయురాలు విద్యార్థులను నేలపై కూర్చోపెట్టినందుకు కరుణకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తరగతిలో ఆడుకుంటూ అరుస్తున్న విద్యార్థులను చూసి, తరగతిలో టీచర్లు లేకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. తరగతి గదులు అపరిశుభ్రంగా నిండుకోవడంతో డీఈఓకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తవణంపల్లె పీహెచ్‌సీని ఆయన సందర్శించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

- రూ.10లక్షలు అందజేసిన ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి

గుడిపాల: గుడిపాల సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత నారాయణమూర్తి గుండెపోటుతో సోమవారం సాయంత్రం మృతిచెందాడు. తన స్వగ్రామం ముత్తువాళ్లూరు గ్రామానికి మంగళవారం ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి వచ్చి ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నారాయణమూర్తి మృతి వైఎస్సార్‌సీపీకి తీరనిలోటన్నారు. అనంతరం వారి కుటుంబానికి ఆయన రూ.10 లక్షలు అందజేశారు. అలాగే నారాయణమూర్తి పిల్లలు ఇద్దరి చదువులకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని కుటుంబసభ్యులకు చెప్పారు. డెప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, నేతలు మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్ రాయల్, హరిప్రసాద్, విద్యాసాగర్, రమేష్, రెడ్డెప్ప, రజినీకాంత్, జనార్దన్, కారిమేఘున్, రాజా, కలైఅరసి, ప్రతాప్‌రెడ్డి, వరదరాజులురెడ్డి నివాళులర్పించారు.

ఎంపీడీఓ కార్యాలయంలో.. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నారాయణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి మండలంలోని సర్పంచులు నివాళులర్పించారు.

ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలి



వైద్య పరీక్షలు చేసుకుంటున్న దిశ ఎస్ఐ నాగసౌజన్య

చిత్తూరు అర్బన్: క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పోలీసులు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలని చిత్తూరు ఏఎస్పీ సుధాకర్ సూచించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాలతో ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్ దిశ, ట్రాఫిక్ పోలీసులకు మంగళవారం స్థానిక పోలీసు అతిథిగృహంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ పోలీసులు విధులు నిత్యం కత్తిమీద సాముతో కూడుకున్నదన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ పోలీసులు విధుల నిర్వహణ సమయంలో శారీరక ఒత్తిళ్లకు గురవుతారని చెప్పారు. ఫలితంగా నిత్యం ఆస్పత్రులకు తిరగాల్సి వస్తోందన్నారు. నెలలో ఒక రోజు ప్రతి ఒక్కరూ సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, వ్యాయామం, యోగా ద్వారా శారీరక, మానసిక ఒత్తిళ్లను దూరం చేసుకోవచ్చన్నారు. అనంతరం పోలీసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎస్‌బీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, దిశ సీఐ బాలయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యుద్దీకరణ పనుల పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: పూనేపల్లె టిడ్కో అపార్ట్‌మెంట్ విద్యుద్దీకరణ పనులను మంగళవారం ట్రాన్స్‌కో ఈఈ పద్మనాభపిళ్లై పరిశీలించారు. అక్కడ నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులను పర్యవేక్షించారు. అపార్ట్‌మెంట్‌లో మొత్తం 2,800 గృహాలు ఉన్నాయని, వీటి విద్యుత్ సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఈఈ తెలిపారు. 315 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 30 ఏర్పాటు చేస్తామని అందులో ఇప్పటివరకు 20 పెట్టామన్నారు. లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సెక్యూరిటీ డిపాజిట్ కింద కిలోవాట్‌కు రూ.200 చెల్లించాలన్నారు. అనంతరం లైన్ పనులను గురించి ఏఈ లోకేశ్‌రెడ్డితో మాట్లాడారు. నిర్మాణ విభాగం ఏఈ సుధాకర్ పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ పనులను పరిశీలిస్తున్న ఈఈ పద్మనాభపిళ్లై

నేడు వాహనాల వేలం

గుడిపాల: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ పలు వాహనాలను బుధవారం సాయంత్రం 4 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఎక్సైజ్ కేసుల్లో ఉన్న వాహనాలను ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వేలం పాట నిర్వహిస్తుందన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు గుడిపాల పోలీస్‌స్టేషన్‌లో రుసుం కట్టి వేలంలో పాల్గొనాలన్నారు.

ఇంటి వద్దకే వైద్యం



రోగులకు వైద్యం అందిస్తున్న డాక్టర్ ప్రియాంక

పూతలపట్టు: ఎం.బండపల్లి పంచాయతీ వడ్డివాని గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక గర్భిణులకు, దీర్ఘకాలిక రోగులకు చికిత్స అందించారు. 62 మందికి ఉచితంగా మందులు అందజేశారు. హెల్త్ అఫీసర్ శ్రీనివాసమూర్తి, దయాకర్‌రెడ్డి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణులకు ఆధునిక వైద్యసేవలు ఇంటి వద్దే అందుతున్నాయని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మంగళవారం వీఎస్.అగ్రహారంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో డాక్టర్ 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఏఎన్ఎంలే, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మానవహారంగా ఏర్పడిన సీపీఐ నాయకులు



నిరసనలో యూటీఎఫ్ నేతలు

చిత్తూరు కార్పొరేషన్: మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని సీపీఐ, యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గాంధీ విగ్రహం వద్ద సీపీఐ, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో వేరువేరుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. గిరిజన మహిళలను వివస్త్రను చేసి ఊరేగించి, లైంగికదాడికి పాల్పడడం అన్యాయమన్నారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు చట్టాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మేల్కొని న్యాయం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నేతలు నాగరాజన్, రమణ, రెహానా బేగం, రెడ్డెప్పనాయుడు, శేఖర్, రమాదేవి, కుమారి పాల్గొన్నారు.

యాప్‌లో నమోదు చేయాలి

తవణంపల్లె: నవజాతి శిశువుల సంరక్షణపై అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీలో నవజాతి శిశువుల సంరక్షణ, అర్హతగల దంపతులు, ఒకటిన్నర సంవత్సరం లోపు పిల్లల సంరక్షణ(హెచ్‌బీవైసీ), విటమిన్-ఏపై ఆశావర్కర్లకు, ఏఎన్ఎంలకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. సీహెచ్ఓ సుబ్రమణ్యం, పీహెచ్ఎన్ భారతి, సూపర్‌వైజర్ శ్రీహరి, అముద, నిర్మల పాల్గొన్నారు.

నవీన నైపుణ్యం సాధించాలి

పుత్తూరు రూరల్: నేటి సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా చేనేత కార్మికులు నవీన నైపుణ్యం సాధించాలని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ ఎల్ఎస్ కుమార్ సూచించారు. మంగళవారం పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లిలో చేనేత కళాకారుల ధ్రువీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నారాయణవనంలో చేనేత సౌకర్య సేవా సముదాయ భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

ఆప్కాస్ ఉద్యోగులకు నవరత్నాల వర్తింపు



వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ (ఆప్కాస్) కింద పనిచేస్తున్న ఉద్యోగులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులని కమిషనర్ డా.అరుణ తెలిపారు. అందరిలాగే నవరత్నాలను ఆప్కాస్ ఉద్యోగులు కూడా పొందవచ్చని స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం ఆప్కాస్ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న ఆప్కాస్ ఉద్యోగులంతా సంక్షేమ పథకాలను పొందడానికి వారికి సమీపంలో ఉన్న సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సచివాలయాల్లోని పర్యావరణ, సంక్షేమ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికులకు నవరత్నాలపై అవగాహన కల్పించి అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి

వి.కోట: రైతులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా కృషిచేస్తోందని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని కొంగాటం పంచాయతీ శివునికుప్పంలో మినీ మార్కెట్ యార్డు నిర్మాణానికి సిద్ధం చేసిన 8 ఎకరాల స్థలాన్ని జేసీ, ఆర్డీఓ శివయ్య పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ వి.కోట రైతులు ఉద్యానవన పంటల సాగుపై ఎక్కువగా ఆధారపడ్డారన్నారు. మూడు రాష్ట్రాల కూడలిలో వి.కోట ఉండడంతో రైతాంగం శ్రేయస్సు కోసం మినీ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని, అందుకే స్థల పరిశీలన నిమిత్తం వచ్చినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు పుష్పలత, సభ్యులు నారాయణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వీణ, రైతు కిశోర్‌రెడ్డి, వ్యాపారస్తులు పాల్గొన్నారు.